# తలుపు గొళ్లెం

డిప్యూటీ కలెక్టర్ పదవిలో ముదిరి, కలెక్టర్ అయిన, సమర్థుడైన ఒక అధికారి మల్లికార్జున రావు. ఏదో రకంగా బి.ఏ పాసై తరువాత పబ్లిక్ సర్వీసు పరీక్ష కూడా పాసై ఉద్యోగం సంపాదించాడు. ఈ కాలంలో కులం గురించి అడగకూడదు గదా! ఆయనకు ఉద్యోగం సంపాదించి పెట్టడంలో అతని కులమే ప్రధాన పాత్ర వహించింది అని చెప్పాలి. ఫలానా కులం వారికి ఫలానా శాతం రిజర్వేషన్ వుంటుందని అందరికీ తెలుసు. కాని ఫలానా కులానికి చెందిన మల్లికార్జున రావు పబ్లిక్ సర్వీసు కమిషన్ పరీక్ష వ్రాసేటప్పుడు, అతని కులానికే చెందిన వేరే ఒక ఉద్యోగార్థికి, అతనికంటే ఒక్క మార్కు ఎక్కువ వచ్చివుంటే, అతనికి ఆ ఛాన్సు దొరికేది కాదు. అతని కులస్థులే కొంతమంది ఎక్కువ మార్కులు సంపాదించి, అతనిపైన వుండగా, ఆతను ఆ గ్రూపులో చివరి వాడిగా బ్రతికి పోయాడు.

ఏది ఏమైనా 'గతం గతః'. ఆయనకు ఉద్యోగం వచ్చింది గదా! అతని కుటుంబంలో ప్రభుత్వ ఉద్యోగం సంపాదించిన మొదటి వ్యక్తి అతనే. మల్లికార్జున్ తండ్రి ఒక మామూలు వ్యవసాయ దారుడు. పెద్ద ఆస్థిపరుడు కాదు. అయినా క్రిష్ణా జిల్లాలో పది ఎకరాల తరి భూమికలిగి వుండేవాడు, అంత తక్కువ వాడేం కాదు. మల్లికార్జున్‌కు ఇద్దరు చెల్లెళ్లు వున్నారు-- మల్లిక, మాలతి. అతనికి ఉద్యోగం దొరికినప్పుడు అతని వయస్సు ఇరవై రెండు. అప్పుడు మల్లికకు పద్దెనిమిది. మాలతికి పది సంవత్సరాలే. అయిదో తరగతిలో చదువుతున్న, చిలిపి తనం గల సీతాకోక చిలుక మాలతి. ఆ చిత్ర శలభం సృష్టి తలిదండ్రుల ఉద్దేశపూర్వకముగా జరిగినది కాకపోయినా, చివరి సంతానం కావటంవల్ల, ఆమె చాలా గారాబంగా పెరిగింది.

మల్లికార్జున రావు తండ్రి ఎత్తు ఐదు అడుగుల ఐదు అంగుళాలు. తల్లి అయితే ఐదు అడుగుల అర అంగుళమే. కాని, పద్దెనిమిది వయస్సులోనే మల్లికార్చున్ రావుకు ఐదు అడుగుల పదకొండు అంగుళాలు ఎత్తు వుండేది. ఉద్యోగం వచ్చే సరికి మొత్తం ఆరడుగులకు చేరుకున్నాడేమో! అతని ముఖం తల్లిపోలిక కలిగి వుండేది. రంగు కూడా ఆమెదే. కొంచెం నల్లటివాడైన తండ్రికి కొడుకు రూపసౌకుమార్యం పట్ల

కొంచెం ఈర్ష్య వుండేదేమో! తమ తమ కుటుంబాల్లో, పెద్ద ఎత్తుగల వాళ్లు ఎవరూ లేకపోవడం మూలాన, తమ కొడుకును, ఇంత మంచి ఎత్తు ఎలా వచ్చిందనే ఆశ్చర్యం ఆ తలిదండ్రులకు కలిగింది గాని, ఆ విషయంలో, ఆ తండ్రి తన భార్యను ఏమాత్రం అనుమానించలేదు.

మల్లిక అయితే తండ్రిగారి కార్బన్ కాపీ. నల్లగా వున్నా, ఆమె చాలా అందంగా వుండేది. నెమలి పింఛాన్ని మరిపించే, ఆమె రింగురింగుల జుట్టు. మోకాళ్లదాకా పెరిగి ఎంతో ఆకర్షణీయంగా వుండేది. ఎత్తు ఐదు అడుగుల నాలుగంగుళాలు. ఆ ఇంట్లో పుట్టడం ఆమెకు ఒక రకమైన ఆత్మన్యూనతా భావం కలిగేది.

కారణం?

అన్నయ్యకు మంచిరంగు వున్నా పరవాలేదు.

చెల్లాయి ఎంత అందగత్తె! బంగారం రంగు. ఎవరు చూసినా ముగ్ధులయ్యే సుందర వదనం మాలతిది. ఆమె నవ్వేటప్పుడు కళ్లు చిన్నవి అవుతాయి. అప్పుడు ఇంకో రెండు చిన్న కళ్లు - - తారకలు - - సొట్టలు ఆ బుగ్గలపై ప్రత్యక్షమవుతాయి. ఒక చిన్నారి దేవకన్యలాంటి చిలిపి బాలిక.

వాళ్ల మధ్యలో కాలిపోయిన రొట్టెలాంటి తను - అని మల్లికకు అనిపిస్తే ఆమెను తప్పు పట్టాల్సిన అవసరం లేదు. పాపం ఆమెలో వున్న అందం ఆమె 'ఇనిఫీరియారిటీ కాంప్లెక్స్' వల్ల, ఆమెకు కనిపించడం లేదు.

మల్లికార్జున్ రావుకు ఉద్యోగం వచ్చిన రోజునుంచి చాలా పెళ్లి సంబంధాలు రావడం మొదలయినాయి. ఆ కులంలో అంత పెద్ద ఉద్యోగస్థులుండడం చాలా అరుదు. అలా వుండగా, పెద్దపెద్ద కుటుంబాల నుంచి మంచి 'బ్రైడ్ గ్రూమ్ మెటీరియల్' కోసం అన్వేషణలు రావడం సహజం. కాని, అతనికి, అతని తలిదండ్రులకు ముందుగా మల్లిక వివాహం జరిపించాలని అభిప్రాయం వుండేది. ఆమె బి.ఏ పూర్తి చేసింది. తర్వాత ఎమ్.ఏ గూడా. ఆమె జీవితంలో నిరాశా జనకమైన పెళ్లి చూపులేమీ జరుగలేదు. అలాంటి ఒక దుర్గతి ఆమెకు వచ్చివుంటే, 'అగ్నిలో ఆజ్యం పోసినట్టు ఆమె 'కాంప్లెక్స్' ద్విగుణీకృత మయ్యేది. చివరకు ఆ తలిదండ్రులకు, అక్కయ్యకి అన్ని విధాలా నచ్చిన ఒక శ్రేష్టమైన పెళ్లి సంబంధం మల్లికకు వచ్చింది. వరుడు ఒక లెక్చరర్. చూడ్డానికి అందంగా వుంటాడు. కాని, సరియైన 'అట్రాక్షన్' అదేమీ కాదు. మల్లిక కోసం, కట్నం అనే ఒక పాపం చెయ్యాల్సిన అవసరం లేదు. అదే సమయంలో, ఆ వరుడి చెల్లాయియైన సులోచనను మల్లికార్జున్ పెళ్లాడడంతో, ఈ కుటుంబానికి, కావాల్సినంత, డబ్బు, ఆస్తి వగైరాలు, చేరుతాయి. ఇలాంటి 'పుణ్యసిద్ధి', పూర్వజన్మ సుకృతం వలననే వస్తుంది. రెండు పెళ్లిళ్లు ఒకేరోజు, ఒకే స్థలంలో జరిగాయి. దానిలో కూడా లాభమే. మల్లిక పెళ్లి కోసం విడిగా ఏమి ఖర్చు కాలేదు.

సులోచన ఎత్తు ఐదున్నర అడుగులు. పెళ్లిరోజున ఆమె 'వైటల్ స్టాటిస్టిక్స్' 48''-38''-54''. ఎత్తు ఎక్కువ వుండడం వల్ల ఆమెది, ఎత్తుకు తగ్గ శరీరమే అని చెప్పొచ్చు. ఆమె లావు ఎక్కువ అని ఎవరూ అనుకోరు. ఆమె మంచి చీర కట్టినప్పుడు, బంగారు కలశానికి తిలకం పెట్టినట్టుంటుంది. ఎంతమంచి 'ఫిగర్'! చీర కట్టిన ఆ 'ఫిగర్'ని చూసి నోటిలో నీరూరిన మల్లికార్జున్ రావుకు మొదటి రాత్రిలో సరియైన 'ఫిగర్' చూడాలని, ఎంతో ఆరాటముండేది. అది చూసే అదృష్టం కలిగిన ఆ క్షణంలో, అతని శరీరంలోని రక్తమంతా ఒకే సారి కాగడం, నాడీ వ్యూహమంతా ఒకేసారి లాగడం, కాన్ని కండరాలు అదరడం అన్నీ అతననుకో కుండా జరిగాయి. అతని గుండెదడ పక్కింటి వాళ్లకు వినిపిస్తుందేమో అన్న సందేహం అతనికి కలిగింది. ఆ రాత్రి పదిన్నర గంటలకు, పాలు, మంచినీళ్లు తాగిన తరువాత గూడా, ఆ డిసెంబరు నెల, చల్లని అర్ధరాత్రిలో, మే నెల మధ్యాహ్నపు వేడిలో, ఫ్యాన్ వేసుకో కుండా నిలబడితే, ఎలా చమటలు కారుతాయో, అలా, స్వేదధారలో ముద్ద అయిపో యాడు. దాహం ఎక్కువ కలగడం వల్ల రెండు గ్లాసుల నీళ్లు త్రాగాడు. కాని, అతని అసలు దాహం అలా శమియింపబడుతుందా? మరి నలభై ఐదు నిముషాలలో అతని దాహం తాత్కాలికంగా శమించింది. కాని, ఇంకో అరగంటలో అతని దాహం రెండింతలుగా ఎగిసి పడింది. ఇంకా ఎక్కువ వివరించకుండా వుండడమే మర్యాదగా వుంటుంది. క్లుప్తంగా చెప్పాలంటే వాళ్లకది ఒక శివరాత్రి. మల్లికార్జునుడికి బదులుగా సాక్షాత్ ఆ పరమ శివుడే ఆ పడక గదిలో వుండి వున్నా ఆయకు కూడా అది శివరాత్రే అయివుండేది. ఆయన రెండు కళ్లూ బయటకు పొడుచుకొచ్చి వుండడమే కాకుండా, ఆయన మూడో కన్ను కూడా, లలితాపవర్ ఒక కన్నులాగా, కనురెప్పలు కదులుతూ వుండేదేమో! కాళిదాసు పార్వతి గురించి చేసిన వర్ణనలకు అతీతంగా అంగాంగ సౌష్ఠవంతో అనుగ్రహీత ఈ సులోచన. అందుకే కాబోలు ఆమె పాణిగ్రహణానంతరం, దశమాసముల లోపల 'కుమార సంభవం' జరిగింది. ఇంక ఒకటిన్నర సంవత్సరాలలో, ఇంకొక కుమార సంభవం కూడా సంభవించింది. మరో పదునాలుగు నెలల్లో, ఒక కుమారీ సంభవం కూడా జరిగింది. ఈ మూడు సంభవాలతో, బంగారు కలశానికి ఏలాంటి లోటు జరుగలేదుగాని, కలశ మధ్యభాగం ఇంకొకసారి వుబ్బకుండా వుండడానికి శస్త్రక్రియ చర్యలు తీసుకోవడం జరిగింది.

ఆ ముగ్గురు పిల్లలూ కలిసి కొట్టుకుంటూ, ఆడుకుంటూ పెరిగారు. చాలా వాత్సల్యం అనుభవిస్తూ పెరిగారు. సుఖ సమృద్ధులలో పెరిగారు. ఆ ఇద్దరు కొడుకులూ, కూతురు మధ్యలో మంచి స్నేహం వుండేది. వారిలో, ఒకరిపై ఒకరికి గౌరవానుభూతి వుండేది. వారికి తలిదండ్రుల మీద భక్తిశ్రద్ధలు చాలా ఎక్కువగా వుండేవి. సులోచనార్జున దంపతులు ఎంతో అదృష్టవంతులు. కారణం ఏమిటంటే వాళ్లకు సకల సౌభాగ్యాలు, సర్వేశ్వరుడు, సకల హస్తములతో పుష్కలంగా ప్రసాదించి వున్నాడు. ముగ్గురు పిల్లలు కలిసి, కార్లో స్కూలుకు వెళ్లడం, తిరిగి వచ్చి పరుగె

త్తుతూ, గెంతుతూ, డైనింగ్ టేబుల్ దగ్గరకు వచ్చి ఫలహారాలు గబగబా తినడం, వాళ్లల్లో వాళ్లు ఏదోమాట్లాడుతూ చిరు తగవులు పెట్టుకోవడం, మళ్లీ కలిసి పోవడం - ఇదంతా చూసి ఆ తల్లికి రోమాంచము కల్గడం ఒక ప్రతిదిన ప్రక్రియగా వుండేది. మల్లికార్జునుడికి పిల్లల పట్ల, చాలా ప్రేమ వుండేది గాని, పిల్లలు ముగ్గురూ స్కూలుకు వెళ్లే రోజులున్నుండి, కొంచెం దూరంగా వుంచడం అలవాటు చేసుకున్నాడు. పిల్లలతో ఎక్కువ, కాలం గడపడానికి అతనికి సమయంగాని, సౌకర్యం గాని వుండేది కాదు. జిల్లాకు డిస్ట్రిక్టు సప్లైయి ఆఫీసరుగా, తర్వాత జాయింట్ కలెక్టరుగా అతను ఎక్కువగా పర్యటించేవాడు. ఇంట్లో వున్నప్పుడు, ఉదయం నుంచే ఫోన్లు, సందర్శకులు రావడం వల్ల అతనకి పిల్లల్ని చూడటానికి కూడా సమయం దొరికేది కాదు. ఇలా కొంతకాలం గడవగా పిల్లలకు తండ్రితో చనువుకంటే ఎక్కువగా, ఆ దూరం తెచ్చి పెట్టిన అకారణభయం చోటు చేసుకుంది. తల్లి అతి వాత్సల్యం వల్ల, పిల్లల క్రమ శిక్షణ కొంత వరకు పాడైపోతుందేమోనని అతనికి ఒక సందేహం వుండేది. అది కొంత వరకు వాస్తవం కూడా. అందుకే అతను తనతో పిల్లలు కొంచెం భయంగా వుండేటట్లు వ్యవహరించేవాడు. అప్పుడప్పుడు పిల్లల్ని మందలించి, చదువు విషయంలో, ఎక్కువ శ్రద్ధ చూపడానికి హెచ్చరించేవాడు. అతను ఏమి చేసినా, మగపిల్లలిద్దరూ చదువులో సమర్థులు కాలేదు. తన పిల్లలకు, తన పారంపర్యమే సంక్రమించేదేమోనని అనుకుని, ఎక్కువగా పిల్లల్ని కోప్పడేవాడుకాదు. అమ్మాయి మాత్రం చదువులో సమర్థురాలిగా వుండేది. పిల్లలు పెద్దవాళ్లు అవుతూండగా, అబ్బాయిలకు వచ్చే మార్కులు మాత్రం తగ్గిపోవడం, జరుగుతుంటే, అమ్మాయికి వచ్చే మార్కులు మాత్రం పెరుగుతూ వచ్చేవి. కాని, ఆ అబ్బాయిలు ఏ క్లాసులో కూడా రెండు సంవత్సరములు కూర్చునట్లు చెడ్డపేరు సంపాదించడం లేదని ప్రస్తావించడం అవసరం.

మల్లికార్జున్‌రావుకు ఐ.ఏ.ఎస్ వచ్చి కొంతకాలమయింది. మామూలుగా ఐ.ఏ. యస్. ఆఫీసరుకు ఒక జిల్లా కలెక్టరు కావడానికి అవకాశం దొరకటమే ఒక మహాభాగ్యమని, ఆ మూడక్షరాల వాళ్లు అనుకుంటారు. ఈ 'ప్రమోటీ' ఆఫీసరు యాభైయేళ్ల లోపలే, మూడు జిల్లాల్లో కలెక్టరు పని చేశాడంటే, అది ఛీఫ్ సెక్రటరీకి కూడా, ఆశ్చర్యము కలిగించిన విషయమని జి.ఏ.డి.లో చెబుతుంటారు. మొదటి సారి ఆయన అనంతపూర్ కలెక్టరయ్యాడు. అక్కడ చాలా సమర్థవంతంగా పదిహేను నెలల, ఇరవైఐదు రోజులు పూర్తిచేశారు. ఆయనకు దొరకిన రెండవ జిల్లా మహబూబ్ నగర్. అక్కడ ఇరవై ఐదు నెలల ఐదు రోజులు పని చేశారు. ఈ రెండు జిల్లాలలో పని చేసే మధ్యకాలంలో, సెక్రటేరియట్ అనే సూపర్ జిల్లాలో గూడా పని చేయడం జరిగింది. రెండవ జిల్లాలో కలెక్టర్‌గా చేసిన తరువాత, ఆయన ఒక కార్పొరేషన్‌కు మేనేజింగు డైరెక్టరుగా పనిచేసి మంచి పేరు సంపాదించ గలిగారు. మూడోసారి కలెక్టరు అయింది -- జాయింట్ సెక్రటరీ హోదాలో వుండి మళ్లీ కలెక్టరుగా వెళ్లడం, అతనికి

రాజకీయంలో వున్న రాజకీయ పలుకుబడి వలననే అని ఇతర ఐ.ఏ.యస్ ఆఫీసర్లు గుసగుసలు చేసుకోవడానికి కారణమయింది. ఈ సారి వచ్చిన జిల్లా, విశాఖపట్టణం కావడం వల్ల, అతనికి, భార్యకు పిల్లలకంతా సంతోషం కలిగింది. పెద్దవాడు వెంకటేశ్వరరావు, బి.కామ్. పాసై ఒక కంప్యూటర్ కోర్సు గూడా పూర్తి చేశాడు. రెండువాడు వెంకట కృష్ణారావు, ఈ మధ్యనే బి.కామ్ పాసయ్యాడు. వాళ్లిద్దరికీ, ముందు ఇంకా చదవడానికి అర్హతగాని, ఉద్దేశ్యంగాని లేవు. తన కొడుకులిద్దరూ కలసి, ఏదైనా వ్యాపారము మొదలు పెట్టడమో లేదా పరిశ్రమను నెలకొల్పడమో, చేస్తేనే మంచిదని మల్లికార్జున్ రావు అభిప్రాయం. చదువులో అగ్రగణ్యమైన విజయలక్ష్మి బి.ఏ (ఇంగ్లీషు లిట్రేచర్) 'ఫస్ట్ ఇయర్' కంప్లీట్ చేసింది. ఆమె, ఆంధ్రా యూనివర్సిటీలో, రెండవ సంవత్సరంలో చేరాలి. క్రొత్త ప్రాంతము, మరియు క్రొత్త కాలేజీ గురించి ఆమె మధురమైన కలలు కనసాగింది. బి.ఏ తర్వాత ఎమ్.ఏ. చెయ్యాలని తర్వాత ఐ.ఎ.యస్ పరీక్షకు సిద్ధం కావాలన్నదే ఆమె ధ్యేయం.

వాళ్లు మే నెలలో విశాఖపట్నం చేరుకున్నారు. ఆ కుటుంబం చాలా సంతోషంగా అక్కడ ఒక్క నెల గడిపారు. చుట్టు ప్రక్కల వున్న ముఖ్యమైన స్థలాలు వాళ్లు సందర్శించారు. చాలా మంది మిత్రులు, బంధువులు వచ్చి వాళ్లను కలుసుకున్నారు.

జూన్ ఐదవ తేది, ఆ బాంబు పేలింది.

తన భార్యను కూడా సంప్రదించకుండా, మల్లికార్జున రావు, విజయలక్ష్మి వివాహం నిశ్చయించాడట. వరుడు పదోక్లాసు కంపార్ట్‌మెంటల్ పద్ధతిలో పాసై, కాలేజీ గేటు కూడా చూడని, ఒక వ్యవసాయదారుడు. వయస్సు ఇరవైతొమ్మిది. రంగు మరీ అంత నల్లటిది కాకపోయినా, ఛామన ఛాయ కంటే ఒక ఛాయ శ్యామము ఎక్కువే. ఎత్తు ఐదున్నర అడుగులు. ఆరడుగుల మూడంగుళాలు. ఆరడుగుల రెండంగుళాలు ఎత్తుగల ఇద్దరు బావలు, ఐదున్నర అడుగుల ఎత్తుగల భార్య, అనే ముగ్గురు వ్యక్తుల మధ్యలో, ఈ వరుడు ఏమైనా ఒక పిగ్మీగా కనిపిస్తాడు. అతను కురూపుడని చెప్పడానికి లేదుగాని, చూసినప్పుడు అతి మామూలు మనిషిలా కనిపిస్తాడు. మొదటి చూపులోనే అతను చదువులేని పల్లెటూరి వాడని తెలిసిపోతుంది. అతనికున్న ఒకేఒక ప్లస్ పాయింట్ ఏమిటంటే, ఎక్కువ ధనవంతులు లేని ఆ కులంలో, దాదాపు ఒక జమిందారు కుటుంబానికి అతను ఏకైక సంతతి అవటమే. తూర్పు గోదావరి జిల్లాలో రామచంద్రాపురం అనే గ్రామంలో వున్న ఒక పెద్ద కుటుంబానికి వారసుడు. ఆ కుటుంబంలో, వందల ఎకరాల పంటభూమే కాకుండా, కోనసీమలో, కొబ్బెర తోటలు కూడా వున్నాయి.

తనను చదువుకోనివ్వాలని ఇప్పుడు వివాహం వద్దు అని చెబుతూ, ఏడుస్తూ విజయలక్ష్మి చాలా రోజులు నిరాహారవ్రతం పాటించింది. ఆ పెళ్లి జరుపవద్దని సులోచన

భర్తను కోరింది, ఏడ్చింది, పోట్లాడింది. కాని ప్రయోజనం శూన్యం. తమ పువ్వు లాంటి చెల్లాయిని, ఆ కోతి చేతికి అప్పజెప్పవద్దని ఇద్దరు కొడుకులు తండ్రితో గట్టిగా వాదించారు. కాని, హై కమాండ్ , ఏ మాత్రము చలించలేదు.

విజయలక్ష్మి చదువు ఆగిపోయింది. జూలై ఐదవ తేది ఉదయం ఆమె వివాహము వైభవంగా జరిగింది. మధ్యాహ్నం భోజనం తర్వాత, వరుడి ఇంటికి ఆమె ప్రయాణమ య్యింది. ఒక నెలనుండి ఏడుస్తూ బ్రతికి చస్తున్న, విజయలక్ష్మి చాలా చిక్కిపోయింది. ఇంత అందగత్తె అయిన, సౌశీల్యంగల సమర్థురాలైన, ఆ తరుణీమణిని, పెళ్ళాడడానికి సిద్ధంగా మంచి మంచి యువకులు కావాలంటే క్యూలో నిలబడుతారు. ఆ సుందరీమ ణికి ఒక స్వయంవరం ఏర్పాటు చెయ్యాలన్నా అసాధ్యమేమీ కాదు. కాని, వివాహప్రా యానికి ముందే ఆమెను అత్తగారింటికి పంపించడానికి ఆ తండ్రికి మనసెలా ఒప్పిందో ఎవరికీ అర్థం కాలేదు. ఆమె పెళ్లి త్వరగా జరిపించాలని బహుశః ఎవరైనా జ్యోతిష్కుడు చెప్పి వుంటాడేమో! పెళ్లిరోజు కూడా ఆమె ముఖంలో ఆ విషాధం కనిపించింది. దివినుండి భువికి దిగివచ్చిన ఒక దేవకన్యలా జీవచ్ఛవంలా, ఆ కళ్యాణమంటపంలో తన విధిని నిందించుకుంటూ మూగగా కూర్చుండిపోయింది ఆ లావణ్యవతి. పెళ్లికి ముందూ - వెనుకా కొన్ని రోజులపాటు మల్లికార్జునరావు ఇంట్లో ఎవరో చచ్చిపోయిన వాతావరణం నెలకొని వుంది. పెళ్లి అయింతర్వాత అత్తగారింటికి వెళుతున్న విజయ లక్ష్మి ''నన్ను ఇలా బలిచేయడానికి నేనేం పాపం చేశాను నాన్నా'' అనే అర్థం వచ్చినట్లు అతి దయనీయంగా చూసింది.

ఆ గ్రామ మధ్యలో కాకపోయినా, మరీ ఒక మూలలో కూడా లేదు - ఆ ఇల్లు. రామసుబ్బారావు అనే ఆ వరుడి పేరు మీదనే, ఆ ఇంటికి 'రామ నిలయం' అనే పేరు పెట్టబడివుంది. దాదాపు ఒక ఎకరం వున్న ఆ ఇంటి కాంపౌండు లోపల, పది దాగా గేదెలు, ముప్పై కోళ్లు, మంచినీటి భావి, కొబ్బరి చెట్లు , మామిడి చెట్లు , పూలు, కాయలు ఇచ్చే రకరకాల ఇతర చెట్లు వున్నాయి.

మొదటి రాత్రి, రామసుబ్బారావు అడిగే కొన్ని ప్రశ్నలు విని దుఃఖంలో వున్న విజయలక్ష్మికి అతనిపై జాలి కలిగింది. ''ఈ పెళ్లి వద్దని నేను ఎంతగానో పోట్లాడాను. చదువులేని నాలాంటి మూర్ఖుడికి, కురూపికి - దేవతలాంటి విజయలక్ష్మిని కలలో కూడా దర్శించడానికి అర్హత లేదని నాకు తెలుసు. కాని, ఈ పెళ్లి గురించి, అమ్మాయికీ, ఆమె తలిదండ్రులకీ ఇష్టంగా వున్నప్పుడు, నాకు మాత్రం అభ్యంతరం ఎందుకుండాలని, నా తలిదండ్రులు అడిగారు. మీలాంటి ఒక అందమైన అమ్మాయికి ఎంత మంచి వరుడు రావాల్సింది. మంచి పర్సనాలిటీ గల, ఒక ఐ.ఏ.యస్సో, ఐ.పి.యస్సో ఆఫీసరు తప్పకుండా దొరికేవాడు. అంతేకాకుండా, మీకింకా వివాహ ప్రాయం కూడా రాలేదు. ఇంకా రెండు మూడు సంవత్సరాల తర్వాత చూసినా బాగుండేది. ఎంతో దూరం ప్రయాణం చేసి మీరు బాగా అలసిపోయి వున్నారేమో!

మీరు హాయిగా నిద్రపోండి. మాట్లాడే విషయాలన్నీ తర్వాత మాటాడుకుందాం'' అని నిర్లిప్తంగా అన్నాడు.

మంచంపై, అవతలవైపు మొహం త్రిప్పుకొని పడుకొన్నాడు రామసుబ్బారావు. అతనికి నిద్ర వచ్చిందో, లేక నిద్రవచ్చినట్టు నటిస్తున్నాడో, కాని దీపాలన్నీ ఆర్పేయడంవల్ల, కొంచెం సేపట్లోనే ప్రయాణ బడలికవల్ల అలసిపోయిన విజయలక్ష్మి కూడా నిద్రపోయింది.

కాని నిద్రపోయే ముందు ఆమె కొంచెం దీర్ఘంగా ఆలోచించింది. ''దీంట్లో ఇతని తప్పేమీ లేదు. నా మెడలో తాళి కట్టినందువల్ల, ఈ రోజు నుంచి ఇతను నా భర్త. బ్రహ్మ వ్రాసిన రాతను ఎవరూ చెరుపలేరు. నన్ను ఈ స్థితికి తీసుకొచ్చినది, వేరే ఎవరూ కాదూ, నా తండ్రే. ఆయన చేసిన పని మంచిదా, చెడ్డదా అని నిర్ణయించడానికి నాకు సమర్థతగాని, హక్కుగాని లేవు. నేను ఎంత ఏడ్చి చెప్పినా, అన్నలు, అమ్మా ఎంత నచ్చజెప్ప చూసినా, ఆయన మనసు కొద్దిగ కూడా కరుగలేదు. ఇకముందు ఆయన ముఖం చూడడంగాని, ఆయనతో మాట్లాడడంగాని నేను చేయను. కట్నం ఇవ్వకుండా మంచి పెళ్లికొడుకు దొరికాడు, తన భారం తొలగిపోయింది అని ఆయన సంతోషిస్తుంటాడేమో! ఇప్పటినుంచి నా ఇల్లు ఇదే. ఈ మంచి మనిషిని నేను ఎప్పుడూ నొప్పించను.''

తెల్లవారు ఝాముననే మంచంపై నుండి ఒక్క ఉదుటున లేచింది విజయలక్ష్మి. ఒక కప్పు వేడి వేడి టీతో తన భర్తను లేపుదామనుకుంది. కాని, తనకంటే ముందే లేచి, తనను లేపకుండా, ఆయన పొలాలు చూడ్డానికి వెళ్లారట. విజయలక్ష్మిలో ఆయనపై, ఆ ప్రభాత సమయాన, ఒక నవ్యాభిమానం చిగురించింది. అత్తమామలతో, ఆ ఇంటి అందరి పనివాళ్లతో చాలా మంచిగా కలుపుగోలుగా మెలిగింది. వీళ్లంతా ఎంత మంచివాళ్లు! ''నాట్య ప్రధానం నగరం దరిద్రం - గ్రామ స్థలం ధర్మశీలే సమృద్ధం'' అనే కవి భావన ఎంత నిజమోనని ఆమె ఆశ్చర్య పడింది.

కాని ఒక చిక్కు -- పడక గదికి ఆనుకొని స్నానాల గది లేదు. వీళ్లు పాతరకం మనుషుల్లా వున్నారు. స్నానాల గదులు మొదలైనవి, పెరట్లో భావి దగ్గర వున్నాయి. విజయలక్ష్మి గుడ్డలన్నీ తీసుకొని స్నానాల గదికి వెళ్లేటప్పుడు, అక్కడ వేడినీళ్లు, సబ్బు అన్నీ సిద్ధం చేసుకొని ఒక పనిమనిషి నిలబడి వుంది. స్నానం ముగించేసి కొత్తబట్టలు వేసుకొని ఇంట్లోకి తిరిగి వచ్చేటప్పుడు, తన పెనిమిటి చిరునవ్వుతో అక్కడ నిలబడి వున్నాడు.

''ఇదే మా పల్లెటూరి పద్ధతి. కొంచెం కష్టంగా వుంది గదూ! మీకు కావలసిన మార్పులన్నీ మెల్లగా చేస్తాం'' అని అతను చెప్పే మాటలు వింటుంటే, ఆమెకేదో ఒక ప్రత్యేక అనుభూతి కలిగింది.

రోజులు గడిచిపోతున్నాయి. ముఖ్యమైన సంఘటనలు ఎక్కువ ఏమీ జరుగలేదు. విజయలక్ష్మిని బి.ఏ. రెండవ సంవత్సరంలో చేర్చడం జరిగింది. రోజూ ఉదయం ఆమె కార్లో కాలేజీకి వెళుతుంది. తిరిగి వచ్చేది సాయంత్రమే. మధ్యాహ్న భోజనం వేడి వేడిగా ఒక పనిమనిషి తీసుకొస్తాడు. విజయలక్ష్మికి ఆ కాలేజీ వాతావరణం బాగా నచ్చింది. చాలామంది స్నేహితుల్ని సంపాదించింది. కాని, ఆమె మిత్రులంతా అమ్మాయిలే. అబ్బాయిలు ఎక్కువమంది ఆమెను రెప్పలు వాల్చకుండా చూసేవారు. పగలు ఎక్కువసేపు కాలేజీలో గడపడంలో ఆమెకు ఏమాత్రం బోరు అనిపించేదికాద. తన తండ్రి తనకు నిరాకరించిన కాలేజీ జీవితం ఎంతో సంతోషంతో ప్రసాదించిన తన భర్తను ఎంత పొగిడినా తక్కువే అని ఆమెకు అనిపించింది. ఎక్కువ చదువుకోకుం డానే, ఇతను మంచి విద్యాసంపన్నుడని, ఎంత చదివినాగాని, ఎంత పై అధికారి అయినా గాని, తన తండ్రి వట్టి ఒక అడవి మనిషి మాదిరే గదా! అని ఆమె తలపోసింది.

ఆమె అభిప్రాయంప్రకారం, ఆ ఇంటికి ఆనుకొని, రెండు ప్రక్కల, వెనకా స్నానాల గదులు నిర్మింపబడ్డాయి. ఓవర్‌హెడ్ ట్యాంక్ కూడా ఏర్పాటు చేయబడింది. ఇప్పుడు స్నానాల గదిలోకి కొళాయిల ద్వారా నీళ్లు వస్తాయి. గేజరు పెట్టడంవల్ల, పని మనుషులు ఇంక స్నానానికి వేణ్ణీళ్లు పెట్టడం అవసరం లేదు. లోపల వున్న గదుల్లో గూడా కొన్ని సర్దుబాట్లు చేయడంవల్ల, విజయలక్ష్మి దంపతులకు ''బాత్ రూమ్ అటాచ్‌డ్ బెడ్ రూమ్'' దొరికింది. అదే సౌకర్యం రామసుబ్బారావు తలిదండ్రులకు గూడా ఏర్పాటయింది. బయటనుంచి బంధుమిత్రాదులెవరైనా వచ్చి నప్పుడు వుండడానికి ఒక 'గెస్ట్‌రూమ్' కూడా తయారయింది. విజయలక్ష్మి తల్లి, అన్నయ్యలు, సెలవు రోజుల్లో అప్పుడప్పుడు వచ్చేవాళ్లు. వాళ్ల మొదటి సందర్శనం లోనే విజయలక్ష్మి సంతోషంగా వుండడం చూసి వాళ్లు ఆనందభాష్పాలు కురిపించారు. ఆమె తండ్రికి, అక్కడకి రావడానికి సమయంగాని, సౌకర్యంగాని దొరికేది గాదు. తల్లి, అన్నలు ఆమెను విశాఖపట్నం రమ్మని ఎన్నిసార్లు ఆహ్వానించినా ''నేను తర్వాత వస్తాను'' అని ఆమె చిరునవ్వుతో ఒక 'స్టాక్ రిప్లై' ఇచ్చేది.

రెండు సంవత్సరాలు గడిచిపోయాయి. మల్లికార్జునరావుకు హైదరాబాదకు ట్రాన్స ఫరయింది.

హైదరాబాదుకు వెళ్లేముందు ఒకసారి అతను కుటుంబ సమేతంగా విజయలక్ష్మి ఇంటికి రావడం జరిగింది. అక్కడ, ఒక కప్పుటీ మాత్రమే తాగాడు. సుబ్బారావు తల్లిదండ్రులు ఎంత బలవంతం చేసినా, మధ్యాహ్నం భోజనం వరకు కూడా ఆయన వుండలేదు. వెళుతూ వెళుతూ కూతురుతో ''నీకిక్కడ అంతా బాగానే వుంది కదమ్మా'' అని మాత్రం అడిగాడు. ఆమె తల వూపడం తప్ప జవాబేమీ ఇవ్వలేదు, కనీసం తలఎత్తి, తండ్రి ముఖంవైపు కూడా చూడలేదు. అలవోకగా ఒకసారి, తన తండ్రిని చూసినప్పుడు, ఆయన ముఖంలో నిండుగా అహంకారం మాత్రమే ఆమెకు

కనిపించింది. టీ త్రాగగానే ఆయన కారెక్కేశాడు. కన్నీరు కార్చుకుంటూ సులోచన, నిండిన కళ్లలో విజయలక్ష్మి అన్నయ్యలు కలెక్టరు గారిని అనుసరించారు. అప్పుడ ప్పుడూ హైదరాబాదుకు వస్తూండమని తన కూతురుని బ్రతిమాలింది సులోచన. కాని విజయలక్ష్మికి తండ్రి ఇంటికి వెళ్లడమనే విషయం ఆలోచించడమే కష్టంగా వుండేది. తండ్రిని గురించి ఎప్పుడు తలచుకున్నా - గర్భవతిగా వుండినప్పుడు అడవిలో వదిలి పెట్టబడిన జానకిలాగా ఆమెకు అనిపించేది.

అంత అందగాడు కాకపోయినా, తన భర్త, కలెక్టరయిన తన తండ్రికంటే అన్ని విధాలా గొప్పవాడే అని ఆమెకు అనిపించింది. తన సంతోషం కొరకు ఏమి చెయ్యా లన్నా అతను సిద్ధంగా వున్నాడు. తనకు అన్ని సుఖాలూ అందించడానికి ఆ స్నేహనిధి ఎన్నెన్నో ప్రయత్నాలు చేస్తున్నాడు. కాని, ఆమెతో ఎన్ని జన్మలు గడిపినా, అతని ఆత్మన్యూనతా భావం తగ్గదని ఆమెకు తెలుసు. ఆమెపై, అతని మనసులో ఏర్పరుచు కున్న ఉన్నతపీఠానికి లోటు, ఎప్పటికైనా కలగదని ఆమెకు పూర్తి నమ్మకం ఏర్పడింది. తన జీవితంలో నష్టపోయినవన్నీ పదిరెట్లకు పైగా, ఈ చిన్న గ్రామము లోనే తనకు లభ్యం అవడం గురించి, ఆమె భగవంతుడికి ద్విహస్తాలతో కృతజ్ఞతలు తెలిపింది. తల్లిదండ్రుల అభిప్రాయానికి విరుద్ధంగా, విజయలక్ష్మి చదువు పూర్తి అయ్యేవరకు, సంతానప్రాప్తి విషయమే ఎత్తగూడదని రామసుబ్బారావు నిర్ణయించుకు న్నాడు.

ఆ వూళ్లో వున్న పెద్ద భవనాలలో వీళ్లదీ ఒకటి. కాలేజీ నుంచి కొంతమంది అమ్మాయిలు విజయలక్ష్మి ఇంటికి అప్పుడప్పుడూ వచ్చేవారు. ఆ అందమైన ఇల్లు, నవీనరీతిలో కట్టబడివున్నా, సింహద్వారం పైన ఒక మూలకు లోపలనుంచి గడియ వేయడానికి ఒక గొలుసు వేళ్లాడుతూ వుండేది. కొందరు ''ఇదేమిటె విజయలక్ష్మీ?'' అని అడిగి నవ్వేవారు. ఒక క్రిష్టియన్ అమ్మాయి, ఆ వేలాడే తోకచూసి పకపకా నవ్వేది. ఒకరోజు భర్తతో, దాన్ని తీసివేయడం గురించి మాట్లాడింది ఆమె. అప్పుడు ఆయన దాని 'ఐతిహ్యం' గురించి వివరించాడు. తన తాతనో, ముత్తాతనో నిర్మించిన, ఈ భవనాన్ని, తన ఇష్టప్రకారం, వాయిదాలు పద్ధతిలో చిన్న చిన్న మార్పులు చేసి, ప్రస్తుత ఆకారానికి తెచ్చినారని, రామసుబ్బారావు చెప్పాడు. పైకప్పు, నేల, కొన్ని గోడలు తలుపులు, కిటికీలు అన్నీ, పాతవి తీసేసి కొత్తవి పెట్టడం జరిగింది. కానీ, సింహద్వారం క్రొత్తది తయారు చేసి పెట్టేటప్పుడు, దానికి లోపల నుంచి, బయట నుంచి తాళంవేయడానికి ఏర్పాటు చేసినా, పాత సింహద్వారంపైన వేలాడే 'తలుపు గొళ్లెం' మాత్రం కొత్త సింహద్వారానికి అమర్చాలని తన తండ్రికి పట్టుదలగా వుండేది. ఆ కుటుంబ, సకల సౌభాగ్యాలకూ ఆ తలుపు గొళ్లెమే కారణమని ఆ పెద్దాయనకు గాఢమైన విశ్వాసం వుండేది. తనకు అలాంటి అంధ విశ్వాసాలు ఏమీ లేవని సుబ్బారావు



కథా నిలయం
3935

గట్టిగా చెప్పాడు. కాని, ..తండ్రిగారి నమ్మకాన్ని వమ్ము కలిగించడం, తనకు ఏ రీత్యా కూడా సాధ్యం కాదని అతను చెప్పాడు.

విజయలక్ష్మికి, ఆర్యపుత్రుడి జననీ జనకుల పక్షం నుంచి, ఏలాంటి బాధగాని, ఇబ్బందిగాని కలిగేది కాదు. ఆమె కాలేజీకి వెళ్లడం వాళ్లకు ఇష్టంలేక పోయినా, తమ ఏకైక సంతానానికి, ఒక సంతానం త్వరలో కావాలనే కోరిక వుండినా, ఆ ఇంటిలోపల స్నానాల గదులు ఏర్పరచడం వాళ్లకు అహితంగా వుండినా ఒక మనోహర కుసుమం లాంటి కోడలితో వాళ్లు ఒక్క సారి గూడా అనుముఖతతో మాట్లాడలేదు. అందుకే కొంతమంది మిత్రులు, తనను పరిహాసం చేయడానికి కారణభూతమైన, ఆ జాంబవం తుడి కాలం తలుపు గొళ్లెం గురించి ఆమె తర్వాత మాట్లాడలేదు. ఆ తల్లిదండ్రుల జీవితానంతరం, ఆ అనాగరిక వస్తువును తీసి పారేద్దామని ఆమె మనసులో చెరగని సిరాతో వ్రాసి పెట్టుకుంది.

కాలచక్రం గిర్రున తిరిగింది. విజయలక్ష్మి బి.ఏ. పాసైయింది. ఉపరి పఠనం కోసం, కాలేజీకి వెళ్లనవసరం లేదని, ఆమె స్వమేధయా నిర్ణయించుకుంది. కాని, కరెస్పాం డెన్స్ ద్వారా, ఎమ్.ఏ. బిరుదు గూడా సంపాదించాలనే ఉద్దేశ్యం వుంది. బి.ఏ. తర్వాత ఒక సంవత్సరంలోపల, ఒక ముద్దులొలికే అబ్బాయికి, ఆమె జన్మనిచ్చింది. అదృష్టవ శాత్తు ఆ అబ్బాయికి తల్లిరంగు, రూపం వచ్చాయి. ఇంక ఆ ఇంట్లో ఉల్లాసాలకు, ఉత్సాహాలకు, ఉత్సవాలకు, రోజుల కరువు ఏర్పడింది. ప్రసవానికి కొన్ని రోజుల ముందే విజయలక్ష్మి తల్లి అక్కడకు వచ్చేసింది. ఆ అబ్బాయి నామకరణ మహో త్సవం అయిపోయిన తర్వాతనే, వాళ్లమ్మ హైదరాబాదుకు తిరిగి వెళ్లింది. ప్రసవం కొరకు హైద్రాబాద్‌కు రావాలని, తల్లి ఎంతో బలవంతం చేసింది గాని విజయలక్ష్మి, దానికి ఒప్పుకోక పోవడంతో, ఆ ప్రేమమూర్తి అక్కడికి పరుగెత్తి వచ్చింది. 'సెక్రటరీ యైన తండ్రి' నామకరణం రోజుకు రావడం జరిగింది - అదేరోజు, భార్యను తీసుకొని వెనక్కువెళ్లడం కూడా, విజయలక్ష్మి అనుకున్నట్లు జరిగింది.

విజయలక్ష్మి ప్రసవానికి ఆరునెలల ముందు వెంకటకృష్ణారావు పెళ్లి విజయవాడలో వైభవంగా జరిగింది. దానికి రెండు నెలలకు ముందు, విశాఖపట్టణంలో వెంకటేశ్వర రావు పెళ్లికూడా జరిగింది. అదొక ప్రేమ వివాహం. అమ్మాయి కులం వేరే అయినా తమకులం కంటే గొప్పది కావడం వల్ల, ఆమె తండ్రి, ఒక పెద్ద డబ్బుసంచి కావడం వల్ల మల్లికార్జున్‌రావుకు, ఆ వివాహానికి అభ్యంతరం చెప్పే అవసరం లేకపోయింది. ఆ రెండు పెళ్లిళ్లకు విజయలక్ష్మి, ఆమె భర్త, అతని తలిదండ్రులు వెళ్లి అమూల్యమైన శుభాశీస్సులతో పాటు అతిమూల్యమైన కానుకలు ఇవ్వడం కూడా జరిగింది.

బాబు బాగోగులు బాగుగా చూసుకోవడంలో, విజయలక్ష్మి తన తొంభైశాతం

సమయం గడిపేది. రామసుబ్బారావుకు, కొడుకు, తనపోలికలతో లేడని చూసి, అభిమానించేవాడు. అతను పెద్దవాడు అయినతర్వాత, ఒకవేళ, ఒక అతిలోక సుందరిని పెళ్లాడినా గూడా, తనకున్నట్టు, అపకర్షతాబోధం అతనికి రావాల్సిన అవసరం లేదని అతను సంతోషించాడు. అబ్బాయికి ఉన్నతమైన విద్య చెప్పించాలని, అతణ్ణి ఒక ఐ.ఏ.యస్. ఆఫీసరుగాని, లేక డాక్టర్నిగాని చేయాలని ఆయన మనసులో నిశ్చయించుకున్నాడు. అతను ఇంట్లో వుండేటప్పుడు, అబ్బాయిని చేతుల్లోకి తీసుకొని అతనితో ఆడుతూ సాయుజ్య సామీప్య ప్రాప్తిలో మైమరచి పోయేవాడు. ఆ చిన్నారి రాజకుమారుడి కోసం ప్రపంచంలో దొరికే అనేక ఆటవస్తువులు తెచ్చి పెట్టాడు. ఆ ముద్దుల కొడుకు యొక్క ఫోటోలను తీయని రోజంటూ లేనే లేదు. అతని నామకరణ మహోత్సవం అత్యంత వైభవంగా జరిపించారు. మొదటి జన్మదినం కూడా అలాగే జరిపించారు. విజయలక్ష్మి తల్లిదండ్రులు, అన్నలు ఆ శుభకార్యంలో ఎంతో సంతోషంతో పాల్గొన్నారు.

కొద్ది రోజుల్లో, విజయలక్ష్మి చదువులో ఇంకో మైలురాయి కూడా దాటింది. ఎమ్.ఏ.పాసైంది. యూనివర్సిటీ ర్యాంకుతో, ఏమ్.ఏ. పాస్ కావడంలో, గర్భధారణ, ప్రసవం, పిల్లవాడి పాలన, పోషణ ఇత్యాదులు అడ్డంకులు కాలేదు. రామసుబ్బారావుకు, విజయలక్ష్మి విజయం ఎంతో గర్వకారణమయింది. ఆ కారణంగా విజయలక్ష్మికి ఒక ఏయిర్ కండిషనర్ మారుతీ కారు కూడా లభించింది.

జీవితం చాలా ఉల్లాస భరితంగా నడచిపోతూంది. విజయలక్ష్మికి ఆ ఇంట్లో సకల సుఖ సౌభాగ్యాలు వున్నాయి. కాని, ఆమె మనసులో ఒక విషయం అప్పుడప్పుడు ముల్లులా గుచ్చుకుంటుంది. సింహద్వారం పైనుంచి క్రిందకు వేలాడుతున్న, జాంబవంతుడి తోక విషయం గూర్చి ఎలిజిబత్ పకపకా నవ్వే దృశ్యం, ఆమె కళ్లముందు అప్పుడప్పుడు ప్రత్యక్షమయ్యేది. ఇంత మంచి ఇంట్లో అత్తామామల అంధవిశ్వాస కారణంగా, ఆ ఇనుపతోక, త్రిశంకు స్వర్గారోహణ స్థితిలో చూసిన అన్నలు, వదినలు ఆమెను ఆట పట్టించేవారు. అందుకే, ఆ తలుపుగొళ్లాన్నీ చూసేటప్పుడంతా, అది తీసి పారేయడానికి ఆమె చేతులు కంపించేవి. ఆ అరోచకవస్తువు అప్రత్యక్షమయితే ఎంత బాగుండేదో అని ఆమె అనుకుంటూ వుండేది.

ఇంకో రెండు సంవత్సరాలు దొర్లిపోయాయి. జీవితం ప్రశాంత స్రవంతిలా సాగిపోతూంది.

ఆ రోజు ఆదివారం. ఆదివారాలంటే కృష్ణమోహన్ రోజులు, ఆ సుకుమార బాలుడికి, ఆ పేరు పెట్టడానికి కూడా తగిన కారణముంది. విజయలక్ష్మికి, శ్రావ్యమైన నవీనమైన ఉత్తర భారతీయమైన ఏదైనా పేరు పెట్టాలని వుండేది. రామసుబ్బారావుకు ఏదైనా ఒక అచ్చతెలుగు పేరు పెట్టాలని వుండేది. అది గూడా చివర్లో 'రావు'

అనే పదం రావడానికి అనుకూలంగా వుండాలి. తాతా, నాయనమ్మలకు, తమ మనవడికి, దేవుడిపేరేదైనా పెట్టాలని వుండేది. మనవడిపేరు, ఒక కోటిసార్లు పిలిచేటప్పుడు, 'రామకోటి'ని వ్రాసిన ఫలం లభిస్తుందని వాళ్ల అభిమతం. ఆ విధంగా మూడు వ్యక్తిస్వాభిప్రాయాల సంకలిత రూపంగా ఈ నామ ప్రదానం జరిగింది. ఆదివారాల్లో రోజంతా, అబ్బాయి ఇంట్లో వుండడం వల్ల ప్రతి ఒక్కరు అతణ్ణి ముద్దులాడేవారు... షిఫ్ట్ సిస్టమ్‌లో. విజయలక్ష్మి మధ్యాహ్నం కొంచెం సేపు అతణ్ణి నిద్రపుచ్చేది. సాయంత్రం సమయంలో, ఇంటి ముందు ఆడుకుంటాడు. అతని ఆటలు చూసి ఆనందించటానికి ఇంటి వాళ్లంతా బయటనే వుంటారు. ఆటల్లో వాళ్లుగూడా పాల్గొంటారు. రాత్రి ఎనిమిది, ఎనిమిదిన్నర వరకంతా అతను నిద్రపోతాడు. మిగతావాళ్లు తొమ్మిదిన్నర, పది గంటలవరకు టీ.వీ. కార్యక్రమాలు గాని, వి.సి.ఆర్‌లో ఏదైనా సినిమాగానీ చూస్తూ కూర్చుంటారు.

ఆ రోజూ, దాదాపు ఇలాగానే జరిగిపోయింది. ఆ అర్ధరాత్రి సమయంలో, ఆ పెద్ద ఇంట్లో అందరూ గాఢ నిద్రలో వున్నారు. నలుగురు పనిమనుషులు, పెరట్లో తమ గదుల్లోగురకలు పెడుతూ నిద్రపోతున్నారు. పాతకాలంనుంచి, ఆ ఇంట్లో కుక్కల్ని పెంచే ఆచారం లేదు. విజయలక్ష్మికి అలాంటి నవీనాశయాలు వున్నా, రామసుబ్బారావుకు కుక్కంటే అలర్జీ.

సమయం ఒకటిన్నర అయ్యింటుంది. అందరూ సుఖ సుషుప్తిలో వున్నారు. సింహద్వారంపై దేంతోనో కొడుతున్నట్టు విని అందరూ లేచారు. రామసుబ్బారావుకు వెంటనే సంగతి అర్థమయింది. అతను ఇంట్లోనుంచే, పెరట్లో నిద్రపోతున్న నౌకర్ల కొరకు కేకవేశాడు. రెండు మూడు నిముషాల్లో, వాళ్లల్లో ఇద్దరు ఇంటి ముందుకు పరుగెత్తుకొచ్చారు. ఈ లోపల రామసుబ్బారావు గూడా లైటు వేసుకొని తండ్రి గదికి వచ్చాడు. ''ఒరే! వీళ్లు బందిపోట్లే. వెంటనే మీ అమ్మను, కోడల్ని, మనవణ్ణి, ధాన్యపు గదిలో పెట్టి లోపల్నుంచి వాళ్లకు తాళం వేసుకోమని చెప్పి, నువ్వు బయటనుంచి తాళంవేసేయ్. పోలీసులకు ఫోన్ చేయాలి. ఇంటి ముందు నేను లైటు వేసి వుంచాను. వాళ్లుదాన్ని పగలగొట్టి నట్లుంది. లోపల లైటు వేయొద్దు. వెలుతుర్లో మనల్ని చూసి కాల్చేయొచ్చు! నువు కూడా ఒక పెద్ద కర్ర పట్టుకో.'' అని కంగారుగా వున్నా, ఒక సేనా నాయకుడి ధైర్యంతో ఆదేశాలు జారీ చేశాడు. కొడుకు ఆదేశాలు ఆలస్యం చేయకుండా అమల్లో పెట్టాడు. తలుపుమీద కొట్టే శబ్దాలు ఆగిపోయ్యాయి గాని, పెరట్నుంచి పరుగెత్తుకొచ్చే ఇద్దరు పనిమనుషుల్ని, ఆ దుండగులు కొట్టి పడేయడం చూసి, వాళ్ల దీనమైన అరుపులు విని, మిగితా ఇద్దరు పనివాళ్లు ఆవైపే రాలేదు. బందిపోట్లు నలుగురున్నట్లుగా కన్పిస్తున్నారు. వాళ్లల్లో ఇద్దరు పెద్ద బండరాళ్లు తీసుకొచ్చి సింహద్వారంపై దాడి ఉధృతం చేశారు. సింహద్వారం తెరుచుకుంటే ఒక విశాలమైన హాలులో ప్రవేశిస్తారు. ఆ హాలుకు ఇరువైపుల రెండు

గదుల తలుపుల వెనక, ఆ తండ్రీ కొడుకులిద్దరూ కర్రలు పట్టుకొని దేనికైనా సిద్ధంగా నిలబడి వున్నారు.

ఒక పెద్ద శబ్దంతో ఆ సింహద్వారం తెరుచుకోబడింది. కాని, ఆ బందిపోట్లు వెంటనే లోపలకు రాలేదు. లోపల వాళ్లకు ఎలాంటి స్వాగతం దొరుకుతుందోయని వాళ్లకు తెలియదు గదా! బయట మంచి వెన్నల వుండడం వల్ల లైట్లు లేకున్నా, ఇంటిలోపల కూడా కొద్దిగా మసక వెలుతురు పరుచుకుంది. వాళ్ల నాయకుడు కాబోలు, ముందు, కిటికీ నుంచి లోపలకు టార్చిలైటు వేసి చూశాడు. తండ్రీ కొడుకులు ఊపిరి బిగబట్టి నిలబడ్డారు. ఆ దొంగల నాయకుడు, సింహద్వారం ముందు నిలబడి మళ్లీ టార్చిలైటు వేశాడు.

అప్పుడు ఒక నమ్మశక్యం గాని సంఘటన జరిగింది. తెరవబడివున్న తలుపునుంచి లోపలికి రాబోతున్న, ఆ నాయకుడు, ''అయ్యో, పాము, పాము'' అని గట్టిగా అరుస్తూ బయటకు ప్రాణభయంతో పరుగెత్తుకెళ్లాడు. మిగిలిన ముగ్గురు దుండగులు పారిపోతున్న నాయకుణ్ణి అదే వేగంతో అనుసరించారు. తండ్రి కొడుకులకు, ఎం జరిగిందో అర్థంకాలేదు. తమను బయటకు రప్పించడానికి ఏదైనా ఉపాయం పన్నారా అని సందేహించారు. అప్పటి వరకు రంగప్రవేశం చేయని, దొంగల ప్రహారాలు తినని ఇద్దరు పనిమనుషులు వరండా వరకు పరుగెత్తుకొచ్చి ''అయ్యా, అయ్యా దొంగలు పారిపోయ్యారు'' అని కంత ధైర్యం ప్రకటించారు. హాల్లో లైట్లు వేసి పామక్కడుందనే భయంతో వాళ్లు మెల్లమెల్లగా సింహద్వారం వరకు వచ్చారు. విద్యుద్దీపాల వెలుగులో అక్కడ పామేమీ లేదని వాళ్లకు తెలిసిపోయింది. సింహద్వారం వరకు వచ్చినప్పుడు, అసలు గుట్టు బయట పడింది. రాళ్లతో, వాళ్లు తలుపుపై కొట్టేప్పుడు, ద్వార బంధానికి తలుపుకు మధ్యనున్న. గడియ వూడి బయటకొచ్చింది. కాని, తలుపుపైన, ద్వారబంధం నుంచి వ్రేలాడుతున్న తలుపు గొళ్లెం పై భాగం నుంచి వూడిపోకుండా, తలుపులో బిగించిన ఇనుపముక్కతో సహా బయటకు వచ్చింది. తలుపు బలంగా, తెరువబడడం వల్ల, ఆ తలుపు గొళ్లెం ముందుకూ వెనక్కూ వూగింది. ఆ మసక వెలుతురులో, ఆ ఇనుపగొలుసు, దాని కొసలో కొంచెం వెడల్పుగా వున్న ఇనుపము క్కతో సహా ఊగడం చూసి, అది పాము పడగవిప్పి ఆడుతున్నట్టు. ఆ బందిపోటు నాయకుడికి, ఆ సమయంలో అనిపించిందంటే దానికి ఆశ్చర్యపడాల్సింది ఏమీ లేదు.

బయట దెబ్బలు తిని క్రింద పడిపోయిన ఇద్దరు పనిమనుషులకు ఎలాంటి ప్రమాదం జరుగలేదు. రామసుబ్బారావు తండ్రి, ఆ స్వామి భక్తిలేని, ఉపయోగరహితులైన, పిరికి పందలైన ఆనలుగురు పనిమనుషుల్ని బాగా తిట్టారు.

మరుసటిరోజు ఉదయం, ఆ పెద్ద మనిషి ఎంతో సంతోషంతో ఆ తలుపుగొళ్లెం మహత్యం గురించి అరగంటసేపు ప్రసంగించాడు. అతని భార్య, కొడుకు, కోడలు, శ్రద్ధగా వింటూ తలలూపారు. పోలీసు స్టేషనుకు రాత్రి ఫోన్ చేశారుగాని, ఒక హెడ్ కానిస్టేబుల్ ఇద్దరు కానిస్టేబుళ్లతో, అక్కడికి వచ్చేసరికి ఉదయం పదిన్నర అయింది. కొన్ని విషయాలు కాగితం మీద వ్రాసుకొని ''తలుపుగొళ్లెం'' అనే మహాద్భుత వస్తువును, విప్పారిన కళ్లతో చూసుకొని..సబ్ ఇన్‌స్పెక్టరు గారు తర్వాత వస్తారని చెప్పినట్టు చెప్పి ..ఆ ఇంటి నుంచి ప్రభాత భక్షణం గొంతుదాకా నింపి దాదాపు పది గంటలప్పుడు వెళ్లిపోయారు.

దాడి జరుగుతున్న సమయంలో విజయలక్ష్మి, తన అత్తగారు, బిడ్డతో, ధాన్యపు గదిలోపల్నుంచి తాళం వేసుకొని, భయంతో గజగజ వణికి పోతూ ఉంది. ఇలాంటి భీకర ఘట్టాన్ని ఎదుర్కొనడం, ఆమె జీవితంలో ఇదే మొదటిసారి. కృష్ణమోహన్ మంచి నిద్రలో వుండడం వల్ల ఆ ధాన్యపు గది లోకి వెళ్లిన తర్వాత అతనికి నిద్రాభంగం కలుగలేదు కాబట్టి, అతను ఏడిస్తే, ఏమవుతుందో అనే ధర్మ సంకటం ఆమెకు కలుగలేదు. అత్త భయంతో ఏమేమో చెబుతూ ఏడ్చేటప్పుడు, విజయలక్ష్మి, ఒక చేత్తో ఆమెనోరు మూసి నిశ్శబ్దంగా వుండమని సంజ్ఞ చేసింది. కాని, బయట ఏం జరుగుతుందో అనే సంభ్రమజ్వాలల్లో ఆమె దహించుక పోతూ ఉంది. తుపాకీ శబ్దాలేమైనా లేదా ఏడుపుశబ్దం ఏమైనా వినిపిస్తుందేమోనని ఆమె అత్యంత మనోవేదనతో చెవులు రిక్కించుకొని వుండిపోయింది. ఆ భయభీతుల గుండెదడకు పది నిముషాల తర్వాత విరామం లభించింది. రామసుబ్బారావు పరుగెత్తుకొచ్చి ''బంది పోట్లు పారిపోయారు - తలుపు తెరవండి, తలుపు తెరవండి'' అని తలుపు కొట్టి చెప్పడంతో, తలుపు తెరచి బయటకు వచ్చిన విజయలక్ష్మి, రామసుబ్బారావు ఛాతీపైన పూర్తిగా అలసి, వాలిపోయి వెక్కివెక్కి ఏడ్వడం మొదలుపెట్టింది. ''ఛ,ఛ ఏమిటీ చిన్నపిల్లలాగా ఏడుస్తున్నావ్? ఇప్పుడు మనం సంతోషించాల్సిన సమయం; మనం నవ్వాల్సిన సమయం'' అని చెబుతూ ఆమెను గట్టిగా పట్టుకొని, నుదుటి మీద చుంచించాడు. వాళ్లిద్దరి మధ్యన దాదాపు నలిగిపోతున్న కృష్ణమోహన్ లేచాడు. అతనికి ఏమీ అర్థం కాలేదు. అతను ఏడ్వలేదు.

జరిగిన విషయాల గురించి ఒక సుదీర్ఘ వివరణ భర్త ద్వారా వినగానే, అత్యాశ్చర్యంతో, అతి వికసితమైన నేత్రాలతో, ఆ 'తలుపు గొళ్లాన్ని' కొంతసేపు అలాగే చూస్తూ వుండిపోయింది. తర్వాత దాన్ని ఆమె చేతితో వూపి వదిలేసింది. ఆ గొలుసు, కొసలో వున్న ఇనుపముక్కతో సహా వూగేటప్పుడు, అది పడగ విప్పి ఆడుతున్న పాములాగే, ఆమెకు కూడా అనిపించింది. మంచి వెలుతురు లేనప్పుడు ఆ తలుపు గొళ్లెం' ఆ దుండగులను పారదోలు నట్టు చేసింది. ఇంక ఆగలేక కొంచెం పైకెగిరి దాన్ని ముద్దుపెట్టుకుంది.

కొన్ని రోజుల్లో, ఇంకా కొన్ని మరమ్మత్తులు ఆ ఇంట్లో జరిగాయి. భవన భేదనం, సాధ్యంగాని విధంగా, 'గ్రిల్' తలుపులు, కిటికీలు అదనంగా నిర్మింపబడ్డాయి. ఆ ఇంటి ఆవరణము, ప్రత్యేకించి రాత్రులలో సురక్షితం చేయడానికి, మూడు శునక భయంకరులు నియోగింప బడ్డాయి. విజయలక్ష్మి చేతిలో ఒక రివాల్వర్, సుబ్బారావు చేతిలో ఒక 'డబుల్ బేరల్ గన్' వచ్చినై.

ఇలాంటి సురక్షా కార్యక్రమాలన్నీ అమలు చేయడం జరిగింది గాని, ఆమెలో కొత్తగా చిగురించిన అంధవిశ్వాసం ..ఆ లోహ సర్పము పుట్టించిన అంధవిశ్వాసం, ఆమె మామలో వున్న అంధవిశ్వాసం కంటే పదిరెట్లు ఎక్కువగా పెరగడం జరిగింది. ఆ తలుపునుండి వేరుపడిన ఆ ఇనుపముక్క పునఃప్రతిష్ఠత మయింది. విరిగిపోయిన తలుపు స్థానంలో, క్రొత్త తలుపు వచ్చింది గాని, ఆ పాత తలుపు గొళ్లెం మరియు లోహపు ముక్కను కొత్త తలుపులో అమర్చే ముందు దానికి అభిషేకం, పూజలు ఇత్యాదులు సక్రమంగా జరిగాయి.

---